
బొబ్బిలి యుద్ధం
ఎన్.ఎస్. నాగిరెడ్డి

# బొబ్బిలి యుద్ధం

(చారిత్రక గాథ)

రచన :

**ఎన్. ఎస్. నాగిరెడ్డి**



Cell : 94403 69056

**శివరామ్ పబ్లిషింగ్ హౌస్**

గులాబితోట, విజయవాడ - 520 003.

BOBBILI YUDDHAM
(Historical Story)

by

N. S. Nagi Reddy

© All Rights Reserved by
Author

First Edition
2011

Cover Design
Durga Rao

DTP & Printed by
Parameswari Press
Vijayawada - 2. Ph : 2434817

Published by
SIVARAM PUBLISHING HOUSE
Gulabhithota, Vijayawada - 520 003.
Cell : 94403 69056

Price

Rs. 80-00

All Desputes subject to Vijayawada Jurisdiction only

# బొబ్బిలి యుద్ధం

## 1756

భారతదేశంలో విదేశీయులైన ఫ్రెంచ్, డచ్, ఇంగ్లీషువారు ఆధిపత్యం సాధించి అఖండ భారతావనిలో తమ స్థానాన్ని సుస్థిరం చేసుకోవాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్న రోజులు. దేశమంతటా వివిధ రాజ్యాలుగా విడిపోయివున్న భూభాగాలను స్వంతం చేసుకోవడానికి విదేశీయులు కుట్రలు పన్నుతున్న సమయం!

సువిశాల భారతదేశంలో ఎన్నోరాజ్యాలు... వాటిక్రింద మరెన్నో సామంతదేశాలు... సంస్థానాలు... అలా శాఖోపశాఖలుగా ఉన్న వారి మధ్య వైరుధ్యాలు... ఒకరినొకరు అణిచివేయాలన్న దుశ్చింత... ఒకరి భూభాగాన్ని ఒకరు ఆక్రమించుకోవాలనే దురాశ.

సామ్రాజ్య విస్తరణ ఒక ఆకాంక్ష అయితే, ప్రక్క రాజ్యాన్ని ఆక్రమించుకోవాలన్నది దురాశ. రాజైన వాడికి సామ్రాజ్య విస్తరణాకాంక్ష లేకుంటే ఆ ప్రభువుకి చరిత్ర వుండదు. ప్రజల సంక్షేమం ఎంతముఖ్యమో, రాజ్య విస్తరణాకాంక్ష కూడా అంతే అభిలషణీయం! అలాంటి వారే సమర్ధులయిన ప్రభువులుగా కొనియాడబడతారు.

అలాంటి కాలంలో ఆంధ్ర భూభాగంలో ఎన్నో సంస్థానాలు విరాజిల్లుతున్నాయి. భువనగిరి, బెల్లంకొండ, ఖమ్మం, వినుకొండ, కొండపల్లి, మైలారం, మొగల్తూరు, చల్లపల్లి, నూజివీడు, కొవ్వూరు, రాజమహేంద్రవరం, పీఠికాపురం, పెద్దాపురం, విజయనగరం, బొబ్బిలి, ఇచ్ఛాపురం ఉచ్ఛస్థితిలో వెలుగుతున్నా నిజాం నవాబుకి సామంతులుగానే కొనసాగుతున్నాయి.

భారతావనిలో ఆంగ్ల, ఫ్రెంచ్, డచ్ దేశస్థులు తమ స్థావరాలను నెలకొల్పి శాశ్వతస్థానాలను సంపాదించడానికి విస్తృతంగా శ్రమపడుతున్నాయి. ఆ క్రమంలో ఒకరు ఒక్కో రాజ్యానికి మద్ధతు ప్రకటించి, వారి తరపున పోరాడి క్రమంగా అక్కడ పాగాలు వేస్తున్నారు.

ఆ దశలో ఫ్రెంచ్‌వారు నిజాం తరపున పోరాడినందుకు నిజాంనవాబు ఉత్తరసర్కార్లను ఫ్రెంచ్ కంపెనీవారికి ధారాదత్తం చేస్తూ ఫర్మానా వ్రాసి ఇచ్చాడు!!

g g g

విజయనగరం నుంచి బొబ్బిలి సంస్థానంకేసి తరలివస్తోందోపటాలం! నిజానికి దాన్ని పటాలం అనడం కంటే జనానా అంటే సబబుగా వుంటుందేమో! నవలక్ష కళింగాధీశ్వరుడు, మన్నెసుల్తాన్ అయిన శ్రీశ్రీశ్రీ పూసపాటి విజయరామ గజపతిరాజు అధిరోహించిన ఏనుగు అంబారీ వెనుక, ముత్యాల పల్లకిలో మహారాణి, యువరాజు ఆనందగజపతిరాజు. వారివెనుక అశేష దాసదాసీజనం, నృత్యకళాకారిణిలు, సాహిత్య గోష్ఠి జరిపే కవివర్యులూ, సేనాపతులూ, దళపతులు.... అలా ఒక చిన్నరాజ్యమే బొబ్బిలికి తరలివస్తున్నట్లుగా వుంది.

దారి పొడవునా వేడుకలు, సంగీత కార్యక్రమాలు, నృత్య వినోదాలు, వంధిమాగధులతో ఛత్ర ఛామరాలతో చూపరులకు అబ్బురం కలిగిస్తోంది. అక్కడక్కడ తగులుతున్న గ్రామాలలోని పౌరులు విజయరామరాజుకి బాటకి అటుఇటూ నిలిచి విజయ ధ్వానాలతో స్వాగతం పలుకుతున్నారు.

విజయరామరాజు సతీసమేతుడై విజయనగరాన్ని వదిలి బొబ్బిలి సంస్థానానికి తరలిరావడానికి బలమైన కారణమే వుంది. ఆ మర్నాడు బొబ్బిలి సంస్థానాధీశులైన రాజారంగారాయుడుగారి ఏకైక పుత్రుడు, యువరాజయిన వెంకటరంగారావు జన్మదినం.

ఆ పర్వదినాన్ని అపూర్వంగా, ఆడంబరంగా వేడుకలతో జరుప నిశ్చయించ తలపెట్టాడు రాజారంగారాయప్రభువు. తలచినదే తడవుగా చుట్టుప్రక్కలవున్న చిన్నచిన్న సంస్థానాధిపతులకు, మిత్రులయిన యోధులకు ఆహ్వాన పత్రాలు తరలివెళ్ళాయి.

ప్రత్యేకించి పూసపాటి వారికి రంగారాయుని ధర్మపత్ని మల్లమ్మదేవి సోదర వాత్సల్యంతో ప్రత్యేక దూతతో ఆహ్వానం పంపగా, దాన్నిమన్నించి, విజయరామరాజు తన పరివారంతో ఒకరోజుముందుగానే బయలుదేరాడు.

కోటకు క్రోసెడు దూరంలోనే నర్సారాయుడు, ధర్మారాయుడు ఎదురేగి మరీస్వాగతం చెప్పారు.

"నవలక్ష కళింగాధీశ్వరులు, మన్నెసుల్తాన్ శ్రీ విజయరామరాజులుంగారు మా బొబ్బిలి ఆహ్వానాన్ని మన్నించి జరగబోవు వేడుకలను వీక్షింప స్వయంగా ఏతెంచు తున్నందుకు ముదంతో స్వాగతం పలుకుతున్నాం." అంటూ ధర్మారాయుడు ఆహ్వానం పలికాడు.

కోట ముఖ ద్వారానికి ముందునుండే రాజావారి గౌరవసూచకంగా ఎర్ర తివాచీ పరచబడింది. మంగళవాద్యాలూ, తూర్యానాదాల మధ్య విడిదిగా కేటాయించబడిన ప్రత్యేక భవనానికి చేరుకున్నారు రాజదంపతులు.

రాణిమల్లమ్మదేవి విజయనగర మహారాణిని సమాశ్వాసించి "దయచేయండి, వదినగారూ! విశేషించి మా సోదరులు క్షేమమేకదా?" అని ప్రశ్నించింది.

చంద్రాయమ్మ చిరునవ్వునవ్వి" వదినగారూ! మహారాజావారికి తమ సోదరిపైగల వాత్సల్యం అనన్యం. తమయోగ క్షేమాలు అరయుటకు తామే స్వయంగా విచ్చేశారు." అంది.

మల్లమ్మదేవి తలతిప్పి చూడగానే మందిర ప్రవేశానికి ప్రక్కనున్న తెరలు గాలికి కదిలినట్లయింది. ఆ తెరలవెనుక నుంచి ఆజానుబాహుడయిన విజయరామరాజు ఛాయారూపం లీలామాత్రంగా గోచరించింది.

మల్లమ్మదేవి వినమ్రురాలై ముకుళితహస్తాలతో నమస్కరించి "సోదరులకు ఈప్రియసోదరి తననమస్కారాలు తెలియజేస్తోంది." అంది.

విజయరామరాజు సాదరంగా "సోదరీ! పుట్టినది దామెర్లవారి సంస్థానమే అయినా ఆ విషయాన్ని విస్మరించి పూసపాటివారిల్లే పుట్టిల్లుగా భావించే నీకు ఏమిచ్చిరుణం తీర్చుకోగలను? ఈ సోదరీమణి యోగక్షేమాలను కాంక్షించడం తప్ప అన్యథా ఏంచేయగలను?" అన్నాడు.

"అవ్యాజమైన తమ అనురాగాలకన్నా మిన్న ఈ సోదరికేమున్నది? ఈ దీనురాలి అభ్యర్ధన మన్నించుటయే కాక, రాచనగరుకి రాగానే ఈ సోదరి యోగక్షేమాలను తెలుసుకోగోరి స్వయంగా వచ్చారు. ఇంతకు మించి ఏ తోబుట్టువుకైనా కావలసింది ఏముంది?" అభిమానంగా అంది మల్లమ్మదేవి.



విజయరామరాజు ప్రేమాభిమానాలతో చూస్తూ" సోదరీ! ఇంతదూరం వచ్చిన మాకు సోదరియోగక్షేమాలను అరయుట మాకనీస బాధ్యతగా భావిస్తాం. రాచనగరులో అందరూ క్షేమమేగా? చిరంజీవి వెంకటరంగారావు ఎక్కడ?" ప్రశ్నించాడు.

"అదుగో...! మీమేనల్లుడు చిరంజీవి ఆనందగజపతితో ముచ్చటిస్తున్నాడు." ఆనందంగా చెప్పింది మల్లమ్మదేవి.

విజయరామరాజు దూరంగా వున్న చిన్నఆసనాలను పరివేష్టించి ముచ్చటించుకుంటున్న యువరాజులిద్దరూ కన్నులపండువగా గోచరించారు.

"మన రెండు రాజ్యాల మధ్య భవిష్యత్ ఎలావుండగలదో ఆ దృశ్యమే చెబుతోంది సోదరీ! మరిక మేముశెలవు తీసుకుంటాం." అన్నాడు విజయరామరాజు.

ఆయన వెనుకే మహారాణి చంద్రాయమ్మ, ఆనందగజపతిరాజు బయలుదేరారు!!

g g g

బొబ్బిలి పాటిగడ్డకు కొద్దిదూరంలో వుంది క్రీడా ప్రాంగణం. యువరాజు జన్మదిన వేడుకల నిమిత్తం అంగ-రంగ వైభవంగా అలంకరించారు. ఎటుచూసినా మంగళ తోరణాలే! విశాలమైన ప్రాంగణంలో ఒకవైపు వెలమదొరలు ఆశీనులు కావడానికి ఎత్తయిన వేదిక వుంది.

వేదిక మధ్యలో రెండు పెద్ద ఆసనాలు, వాటికి కుడివైపున కొన్ని ఆసనాలు, ఎడమవైపున మరికొన్ని ఆసనాలున్నాయి. ప్రాంగణం మధ్యలో పోటీలకు నెలవుగా వున్న ప్రదేశంలో ఇసుకమైదానం వుంది.

దాని చుట్టూ బొబ్బిలి ప్రజలేగాక, విజయనగరం నుంచి పూసపాటి విజయరామగజపతితో ఆ వుత్సవాల్ని వీక్షించడానికి ఏతెంచిన విజయనగరవాసులు కూడా వున్నారు. క్రీడోత్సవాల ప్రారంభం ఎప్పుడా అని ఆత్రంగా చూస్తున్నారు.

కుడివైపునున్న ఆసనాల్లో ముందుగా ధర్మారాయుడు, ఆయన ప్రక్కనే ముదుసలి అయినా పటిమతగ్గని నర్సారాయుడు, వారివెనుక బొబ్బిలి పౌరుషానికి చిహ్నం, ఆవేశానికి ప్రతిరూపం అయిన యువకుడు వెంగళరాయుడు ఆశీనులయి వున్నారు.

అంతలో క్రీడావాటిక అంతా ఒక్కసారి సద్దుమణగడంతో ధర్మారాయ ప్రభృతులు అటుచూశారు. క్రీడాప్రాంగణం ముందు బలమైన అశ్వాన్ని ఆపిక్రిందకు వురికిన ఆజానుబాహుడ్ని చూసి అంతా వినయంగా లేచినిలబడ్డారు.

వంధిమాగధులు "మహారాజా రావు గోపాలకృష్ణ రంగారాయణింగారికి జై!" అంటూ జయజయ ధ్వానాలు పలుకుతూ ముందు నడుస్తుండగా ఠీవిగా, హుందాగా వేదిక నధిరోహించాడు. ఆయన వెనుక రాజసేవకుడు వరహాలు, యువరాజు రావు వెంకటరంగారావుని వేదిక మీదకు తొడ్కొని వచ్చాడు.

“ధర్మారాయునింగారూ! విజయనగర ప్రభువులు ఇంకా వేంచెయ్యలేదా...?” ఆసనాన్ని పరివేష్టిస్తూ ప్రశ్నించాడు రంగారాయుడు.

“నవలక్ష కళింగాధీశ్వరుడు, డబ్బయ్‌రెండు మాన్యాలకు మన్నెసుల్తాన్ అయిన విజయనగర ప్రభువులు సమయానికి రావడం జరిగితే వారి గొప్పతనం ఏముంది?” ధర్మారాయుడి కంఠంలో వ్యంగ్యం తొంగిచూసింది.

“ఇలాంటి వేడుకలకు నిర్ణీతసమయానికి రావాలని తెలియదా?” ముక్కుపుటాలు ఎగరేస్తూ అన్నాడు వెంగళరాయుడు.

“వెంగళరాయనింగారూ! ఆయన ఎంతయినా మన అతిథులు. రాచనగరులో ఏమైనా కార్యాలుండవచ్చు. అందువల్ల ఆలస్యం అయివుండవచ్చు. అన్ని సమయాల్లోనూ ఆవేశం శ్రేయోదాయకంకాదు. కొంత తడవువేచి వుండకతప్పదు....” అన్నాడు రంగారాయుడు కొనగోటితో మీసాన్ని దువ్వుతూ.

అదే సమయంలో మరోవైపు కోలాహలం కానవచ్చింది. పౌరులతోపాటు ముఖ్య రాజోద్యోగులూ అటు చూశారు. ఏనుగు అంబారీపై విజయరామరాజు తన కుమారుడు ఆనందగజపతితో క్రీడాప్రాంగణానికి వచ్చేశాడు.

వంధిమాగధులు గొంతెత్తి “నవలక్ష కళింగాధీశ్వర, డబ్బయ్‌రెండు పాలాలకు మన్నెసుల్తాను, రత్నకిరీటధారి, శ్రీశ్రీశ్రీ పూసపాటి విజయరామగజపతిగారికి జై....!” అంటూ పలుకుతుండగా మీసాన్ని దువ్వుతూ వేదిక మీదకు చేరుకున్నాడు.

రావుగోపాలకృష్ణరంగారాయుడు తన ఆసనంలోంచి లేచి “విజయనగరప్రభువులకు స్వాగతం! మా ఆహ్వానాన్ని మన్నించి ఈ క్రీడోత్సవాలను వీక్షించ ఏ తెంచిన తమ ఆదరానికి మేమెంతగానో సంతోషిస్తున్నాం.” అన్నాడు.

విజయరామరాజు ఆదరంగా నవ్వి “మీరు అందించిన ఆహ్వానం మాగౌరవాన్ని మరింత ఇనుమడింపజేసింది. ముందుగా మాసోదరి మల్లమ్మదేవిని పలకరించబోవ ఒకింత ఆలస్యం అయింది.” అన్నాడు.

“ప్రభువుల రాకలో ఆలస్యం అనివార్యం... తమ రాకకై అంతా నిరీక్షిస్తున్నారు. తమరు అనుమతిస్తే క్రీడోత్సవాలను ప్రారంభించవచ్చు...!” అన్నాడు రంగారాయుడు.

విజయరామరాజు భుజాలెగరేసి “అవశ్యం...!” అన్నాడు.

రంగారాయుడి సైగను అందుకున్న ధర్మారాయుడు రెండుబలమైన ఈటెలను అందుకున్నాడు. రంగారావు విజయరామరాజులతో వేదిక దిగి మల్లయుద్ధ ప్రదర్శనావేదిక ముందుకొచ్చాడు. ధర్మారాయుడు బరిశెలను ఇద్దరికీ అందించాడు.

రంగారాయుడు బరిశెను పరిశీలించి చూస్తుండగా విజయరామరాజు “రంగారాయుణింగారూ! ఉత్సవాన్ని ప్రారంభించండి.” అన్నాడు.

రంగారాయుడు చిన్నగా నవ్వి” తమరు మా అతిథులు! ప్రారంభం చెయ్యాల్సింది తమరే...!” అన్నాడు మృదువుగా.

"మీ అభీష్టాన్ని తప్పక మన్నిస్తాం...!" అంటూ తన చేతిలోని బరిశెను రెండు మూడుసార్లు గాలిలో ఆడించి బలంగా విసిరాడు విజయరామరాజు.

ఆ ఈటె బలంగా గాలిని చీల్చుకుంటూ ఆకాశంలో దూసుకుపోయి చాలా దూరంలో, నేలలో దిగబడింది. అది చూసి విజయనగర పౌరులంతా ఆనందోద్రేకాలతో పెద్దగా అరిచారు.

రామరాజు మీసం దువ్వుతూ కోరగా బొబ్బిలి ప్రభువుకేసి చూశాడు. రంగారాయుడు ఈటెని కళ్ళకద్దుకుని, వేణుగోపాలస్వామిని తలుచుకుని గాల్లోకి విసిరాడు.

ఆ బరిశె ఒక్కసారిగా గాలిలో ఝుం ఝుం మారుతాల్ని సృష్టిస్తూ, సన్నగా శబ్దాన్నిచేస్తూ దూసుకుపోయింది. అందరూ చూస్తుండగానే పాటిగడ్డ బయటవున్న కోట బురుజుని దాటి అవతలపడింది.

ఒక్కసారి ఆ ప్రాంతమంతా జయజయ ధ్వానాలతో హోరెత్తిపోయింది. బొబ్బిలిపౌరుల్లోని యువకులు ఉత్సాహంగా అరిచారు.

"బొబ్బిలి శౌర్యానికి నిదర్శనం. బొబ్బిలి దొర, ప్రభువులు రంగారాయునింగారికి జై..." ఆ జయ ధ్వానాలు విజయరామరాజు చెవులకి ఒకింత ఇబ్బందిగా తోశాయి. శూలాలు గుచ్చినట్లయింది. అతికష్టంమీద తన భావాలు ముఖంలో ప్రతిఫలించకుండా జాగ్రత్తపడుతూ పెదవులపై నవ్వును పులుముకుంటూ అన్నాడు.

"రంగారాయునింగారి శౌర్యం నానాటికీ ద్విగుణీకృతం అవుతున్నది."

"అవును. బొబ్బిలి వెలమదొరలకు వయసు పెరిగేకొలదీ శౌర్యం కూడా పెరుగుతుంది. అందులో కొత్తదనమేమీ లేదు." అన్నాడు రంగారాయుడు మీసాన్ని మెలివేస్తూ.

క్రీడోత్సవాలు ప్రారంభమయ్యాయి. కొంతమంది యోధులు అశ్వాలపై రక-రకాల విన్యాసాలు చేశారు. జనం ఈలలు వేస్తూ విన్యాసకుల్ని ఉత్సాహపరిచారు.

తరువాత కత్తులతో ద్వంద్వయుద్ధం, బరిశెలతో విన్యాసం, కొంతమంది కర్రసామును ప్రదర్శించారు. విజేతలకు బొబ్బిలి ప్రభువు, బహుమతుల్ని పంచిపెట్టాడు.

మధ్యాహ్న భోజనాలనంతరం మల్లయుద్ధ పోటీలు ప్రారంభమయ్యాయి. మొదటి దశలో బొబ్బిలి మల్లయోధుడు పైచేయిగా నిలిచాడు. అప్పుడు విజయనగరంలో ప్రఖ్యాతి చెందిన మల్లయోధుడు అప్పలస్వామి గోదాలోకి దిగాడు.

అప్పలస్వామి ఆ చుట్టుప్రక్కల సంస్థానాల్లో పోరాడి ఎంతోమందిని జయించి అపర యోధుడిగా పేరు పొందాడు. అంతవరకూ ఓటమి ఎరుగని అప్పలస్వామి గర్వంగా భుజాలు చరుచుకున్నాడు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=688**